ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 20.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





జగతి సిగలో ప్రేమపుష్పం

- అమృతమూర్తి సత్యసాయి
- శత జయంతికి సిద్ధమైన పుట్టపర్తి







బాబా చిన్ననాటి చిత్రాలు



ప్రేమ, కరుణ మానవ రూపంలో ఉంటే..! నిస్వార్థ సేవ నేలపై నడయాడితే..! అవి నిస్సందేహంగా పుట్టపర్తి సత్య సాయి బాబాలాగే కనిపిస్తాయి. మారుమూల పల్లెలో పుట్టి, ఆధ్యాత్మిక చింతనతో ఎదిగి, అవతార ప్రకటనతో సత్యసా యిగా మారిన మహనీయులు.. ఆయన. ఆధ్యాత్మిక బోధనలతో ప్రపంచాన్ని తన వైపు తిప్పుకుని, ఆ ప్రపంచానికి చక్రవర్తిగా ఎది గారు. విశ్వగురువుగా అవతరించారు. మనిషి ఆనందమయ జీవితా నికి సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలే సోపానాలని బోధిం చారు. కరువుసీమలో తడారిన గొంతులకు జలసిరులిచ్చిన కారుణ్య మూర్తి ఆయన. ఉచిత విద్య, వైద్యంతో అభాగ్యుల బతుకులు మార్చి, వారి హృదయాల్లో భగవంతుడిగా కొలువయ్యారు. 'అందరినీ ప్రేమిం చండి.. అందరికీ సేవ చేయండి' అనే నినాదంతో తన ధార్మిక, సేవా కార్యక్రమాలను విశ్వవ్యాప్తం చేశారు. తాను నడయాడిన నేలపై తన సంస్థల సేవలు కొనసాగేలా తీర్చిది ద్దారు. సత్యనారాయణగా జన్మించి.. సత్య సాయిగా అవతరించిన ఆయన.. ఈ నేలపై నడయాడి వందేళ్ల అవుతోంది. అందుకు గుర్తుగా పుట్టపర్తిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వ ర్యంలో సత్యసాయి శత జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సత్యసాయి జీవిత విశేషాలు, ఆయన సేవలలో కొన్నింటిపై నేటి నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాలు అందిస్తోంది.

సాయినామం.. విశ్వవ్యాప్తం..



- ఆధ్యాత్మిక బోధనలతో గుర్తింపు
- మానవాళికి మహోన్నత సేవలు
- శాంతి వేదిక ప్రశాంతి నిలయం

6

శాంతి.. ప్రేమను చాటాలి..!

- భక్తులకు అసౌకర్యం కలగకూడదు: మంత్రులు
- సత్యసాయి శతజయంతికి 19న ప్రధాని రాక
- అధికారులతో మంత్రుల కమిటీ సమీక్ష



సమావేశంలో మంత్రులు సవిత, ఆనం, కేశవ్, అనగాని, సత్యకుమార్

పుట్టపర్తి టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శతజయంతి ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృ త్వంలోని మంత్రుల కమిటీ మంగళవారం సమీక్ష నిర్వహించింది. పుట్టప ర్తిలోని సాయి ఆరామంలో కలెక్టర్ శ్యాంప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో భద్రత, వసతి, రవాణా, వైద్యం తదితర అంశాలపై చర్చిం చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పూర్తిచేయా లని మంత్రి అనగాని సూచించారు. భక్తి, శాంతి, ప్రేమను చాటేలా ఉత్స వాలను నిర్వహించాలని సీఎం చంద్రబాబు సూచించారని అన్నారు. ఆ దిశగా అధికారులు పనిచేయాలని అన్నారు. ట్రస్టు సభ్యుల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు. శతజయంతి ఏర్పాట్ల గురించి కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. శతజయంతి ఉత్సవాలకు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేస్తామని ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు.

- గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని లోటుపాట్లను సరిదిద్దుకోవా లని మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు. భక్తులకు తగిన సౌకర్యా లను కల్పించాలని అన్నారు. చిత్రావతి ట్యాంక్‌బండ్‌పై జంగిల్ క్లియరెన్స్ చేసి అభివృద్ధి చేయాలని అన్నారు.
- భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి వేడుకలను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రధానమంత్రి పర్యటనకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా వైద్యాధికారులతో మాట్లాడి వైద్య సదుపాయాలు కల్పించాలని అన్నారు. వైద్యపరమైన అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.
- శత జయంతి వేడుకలపై సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవ న్ కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారని మంత్రి సవిత అన్నారు. ఈ నెల 17 నుంచి 23 వరకు ప్రముఖులు (మిగతా 6లో...)

ప్రతి కుటుంబానికీ ఉద్యోగం

అదే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి పయ్యావుల కేశవ్

ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన



మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్, ఫొటోలో కలెక్టర్ ఆనంద్, ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం న్యూటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబానికీ ఉద్యోగావకాశం కల్పించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మంగళవారం ప్రకాశం జిల్లా కనిగిరి మండలం పెద ఈర్లపాడు నుంచి 50 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ రోడ్డులో గల పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయ ప్రాంగణంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ శంకుస్థాపన

(మిగతా 6లో...)

ద్వంద్వ విధానాలతో కూటమి ప్రభుత్వం మోసం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

- వివరాలు 7లో...

ప్రమాదమా..? కుట్రా..?

- మెడికల్ కాలేజీలో ల్యాబ్ దగ్ధం
- పెద్దాస్పత్రిలో విద్యుత్ వైర్ల కత్తిరింపు
- ఏఎంసీలో అర్ధరాత్రి రోగుల హాహాకారాలు



ఏఎంసీ వార్డులో చికిత్సలు పొందుతున్న రోగులు

అనంతపురం వైద్యం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సర్వజన వైద్యశాల, మెడికల్ కాలేజీలో ఒకే రోజు అవాంఛనీయ, అనుమానాస్పద సంఘట నలు చోటు చేసుకున్నాయి. మెడికల్ కాలేజీ హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్ధా రణ పరీక్షల కేంద్రంలో షార్ట్ సర్క్యూట్, పెద్దాస్పత్రి విద్యుత్ వైర్ల కత్తి రింపు కలకలం రేపాయి. మెడికల్ కాలేజీలో ల్యాబ్‌లో రూ.5 కోట్ల విలు వైన యంత్రాలు, ఉపకరణాలు దగ్ధం కాగా, పెద్దాస్పత్రి అత్యవసర విభాగంలో సుమారు అరగంట పాటు అంధకారం అలుముకుంది. వెంటిలేటర్‌పై ఉన్న రోగుల ప్రాణా లను కాపాడేందుకు వైద్యులు, సిబ్బంది హైరానా పడాల్సి వచ్చింది. ఈ రెండు సంఘటనలు సోమ వారం అర్ధరాత్రి చోటు చేసుకు న్నాయి. ఇవి యాదృచ్ఛికమా, ఉద్దేశ పూర్వకంగా ఎవరైనా చేశారా అన్నది నిర్ధారణ కావాల్సి ఉంది.



ప్యానెల్ బోర్డులో వైర్లను కట్‌చేసిన దృశ్యం

ఏఎంసీలో హాహాకారాలు

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సోమవారం అర్ధరాత్రి విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించారు. దీంతో అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లో అంధకారం అలుముకుంది. వెంటిలేటర్లు, ఇతర యంత్రాలు ఆగిపోవడంతో రోగులు హాహాకారాలు చేశారు. వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని వైద్యులు, రోగుల బంధు వులు హడలిపోయారు. సెల్‌ఫోన్ లైట్‌లను ఆన్ చేసుకుని బిక్కుబి క్కుమంటూ గడిపారు. ఏఎంసీలో 25 బెడ్లు ఉండగా, అన్నింటిపై తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులే ఉన్నారు. మంగళవారం రాత్రి కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అయినా జనరే టర్‌ను ఆన్ చేయలేదు. ఏఎంసీ, సీటీటీ, పీడియాట్రిక్ వార్డులకు ప్రత్యేక జనరేటర్‌లు ఉన్నా సిబ్బంది పట్టించుకోలేదు.

ముసుగులో వచ్చి..

ఏఎంసీలోకి వెళ్లేదారిలో ఒక సీసీ కెమెరా ఉంది. లోపలికి వెళ్లగానే కుడివైపు ఏఎంసీ, ఎడమ వైపు సీటీటీ ఉన్నాయి. సీటీటీ ఆవరణలో మెట్లకింద ఎలక్ట్రికల్ ప్యానల్ బోర్డును ఏర్పాటు చేశారు. దీనికి రక్షణగా ఇనుప గ్రిల్స్‌ను ఏర్పాటు చేసినా, తాళం వేయలేదు. ఇదే అదనుగా ముసుగు ధరిం చిన ఓ వ్యక్తి లోపలికి వెళ్లి ప్యానెల్ బోర్డులోని వైర్లను కట్ చేసినట్లు తెలుస్తోంది. ముసుగు ధరించిన వ్యక్తి ప్యానెల్ బోర్డు వద్దకు వెళ్లిన ట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయిందని భద్రతా సిబ్బంది అంటు న్నారు.

ఇది హత్యాయత్నమే..

పెద్దాస్పత్రి ఏఎంసీ వార్డుకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం హత్యాయత్నం కిందకు వస్తుందని న్యాయ నిపుణులు అంటున్నారు. ఇది కొన ఊపిరితో ఉన్న రోగులకు వైద్యం అందకుండా చేసే ప్రయ త్నమని అంటున్నారు. అత్యవసర విభాగంలో ఇలాంటి చర్యలకు పాల్పడేవారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయవచ్చునని అంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించా లని రోగులు, వారి బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు చేయూత

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



కంపెనీ ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చేయూతనిస్తోందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. నియోజకవర్గంలో రూ.8వేల కోట్లతో గాలిమరలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఎకోరాన్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్‌కి సంబంధించిన దేశ్‌రాజ్ సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గాలిమరల ఏర్పాటుకు పట్టణంలోని ప్రజావేదిక వెనుక వైపు ఉన్న మైదానంలో మంగళవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లా డుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో పరిశ్రమలు పెట్టకుండా, పెట్టుబడులు పెట్టే వారిని బెదిరించారని విమర్శించారు. కూటమి పాలనలో ఈ ప్రాంతంలో పలు కంపెనీలు.. పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. దేశ్‌రాజ్ సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ 300 మెగావాట్ల పవన విద్యుదుత్పత్తి లక్ష్యంతో కంబదూరు, శెట్టూరు, కళ్యాణదుర్గం మండలాల పరిధిలో రూ.2,920 కోట్లతో గాలిమరలు ఏర్పాటు చేస్తోందన్నారు. ఓ2 పవర్ ఎస్జీ ప్రైవేట్ లిమిటెడ్ 201 మెగావాట్ల పవన విద్యుదుత్పత్తి లక్ష్యంగా కంబదూరు పరిధిలో రూ.1,651 కోట్ల పెట్టుబ డులు పెడుతోందన్నారు. బ్రైట్ ఫ్యూచర్ సంస్థ రూ.3,800 కోట్ల పెట్టుబడులు పెడుతోందన్నారు. కార్యక్రమంలో దేశ్ రాజ్ సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ అమిత్ గుప్తా, ఓ2 పవర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ అశ్విన్, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, ఆర్డీఓఓ వసంతబాబు, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, తహసీల్దార్ భాస్కర్, నెడ్ క్యాప్ పీడీ శివశంకర్ పాల్గొన్నారు.

రైతులకు సరైన పరిహారం చెల్లించండి

- జేసీ శివనారాయణ శర్మ



మాట్లాడుతున్న జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులు నష్ట పోకుండా సరైన పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ (జేసీ) శివనారాయణ శర్మ ఆదేశించారు. కలెక్టరే ట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ టవర్ల ఏర్పాటుపై సంబంధిత అధికారులతో జేసీ సమావేశం నిర్వ హించారు. ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని కణేకల్లు, బొమ్మనహా ళ్, ఉరవకొండ, కూడేరు, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు, రాయదుర్గం, డీ హిరేహాళ్ మండలాల్లో ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. పునరుత్పా దక ఇంధన జోన్ నుంచి విద్యుత్తును తరలించడానికి అనంతపు రం-కడప ట్రాన్స్‌మిషన్ లైన్ నిర్మాణం చేపడుతున్నారన్నారు. యల్ల నూరు, పుట్లూరు, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం తదితర మండ లాల్లో ఉద్యాన పంటలు ఎక్కువగా ఉన్నాయన్నారు. రైతులు నష్ట పోకుండా సరైన పరిహారం అందించేందుకు కంపెనీ ప్రతినిధులు, ఆయా మండలాల తహసీల్దార్లు సమన్వయంతో సర్వే చేసి నివేదిక అందజేయాలన్నారు. సమావేశంలో ఆర్డీఓలు కేశవనాయుడు, వసం తబాబు, ఏపీఎస్పీ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, తహ సీల్దార్లు, వ్యవసాయ, ఉద్యాన అధికారులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో రికవరీ పెంచండి..!

- నేర సమీక్షలో ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): చోరీ కేసుల్లో రికవరీలు పెంచాలనీ, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో విచారణ త్వరగా పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్లు దాఖలు చేయాలని ఎస్పీ జగదీష్.. పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగ ళవారం నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. పోక్సో, హత్య, రేప్, డెకా యిట్, చోరీ, వాహనాల అపహరణ, రోడ్డుప్రమాదాలు తదితర అంశా లపై ఎస్పీ సర్కిళ్ల వారీగా సమీక్ష చేశారు. ఆయన మాట్లాడుతూ... జిల్లాలో స్టేషన్ల వారీగా ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్ కొనసాగించాలన్నారు. కేసుల పరిష్కారం దిశగా పని చేయాలన్నారు. దర్యాప్తు పూర్తయిన కేసుల్లో చార్జిషీట్లు వేయడంలో ఆలస్యం వద్దన్నారు. రాత్రిపూట గస్తీ పెంచాలన్నారు. ఐరాడ్ (ఐఆర్ఏడీ) ద్వారా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. పేకాట, మట్కా, కోడిపెందేలపై నిఘా పెట్టడమేకాకుండా గంజాయి వంటి మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ఫలితాలు, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో తాడి పత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్, డీఎస్పీలు శ్రీనివాసరావు, రవిబాబు, శ్రీని వాస్, వెంకటేషులు, మహబూబ్ బాషా, సీఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగదీష్

ఆదర్శప్రాయుడు.. అబుల్ కలాం

ఘననివాళి అర్పించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే, ఎంపీ



నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతపురం క్రైం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆదర్శప్రా యుడు అని ప్రజాప్రతినిధులు కొనియాడారు. ఆయన జయంతిని పురస్కరించుకుని మంగళ వారం నగరంలోని టవర్‌క్లాక్ వద్ద గల విగ్రహా నికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్ర సాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అ ర్పించారు. తర్వాత ప్రజాప్రతినిధులు మాట్లా డుతూ... హిందూ, ముస్లింల ఐక్యత కోసం మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎంతగానో కృషి చేశారన్నారు. మహాత్మాగాంధీతో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. విద్యా శాఖ మంత్రిగా ఎనలేని సేవలు చేశారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సాయినామం.. విశ్వవ్యాప్తం

ఆధ్యాత్మిక బోధనలతో గుర్తింపు
మానవాళికి మహోన్నత సేవలు
శాంతి వేదిక ప్రశాంతి నిలయం

మానవజాతి అంతటినీ ఒకే కుటుంబంగా ఏకం చేసి ప్రతి ఒక్కరిలో ఆత్మసత్యమును స్థిరముగా నెలకొల్పి ప్రకాశింపజేయడానికి నేను అవతరించాను. ఇదే మీ అందరికీ సాయి సందేశం. నవయుగానికి వైతాళికులు కండి.. స్వార్థము, దురాశ, ద్వేషము, హింసను వదిలిపెట్టండి. మీకు.. మీరు జ్యోతి స్వరూపులుగా ఉండండి. ఇతరులకు వెలుగు బాటను చూపండి.

సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే పంచ సూత్రాలను ఎవరు ఆచరిస్తారో వారి జీవితం సుఖమయంగా, ఆనందంగా సాగుతుంది. నిత్యం సత్యాన్ని పలుకుతూ, ధర్మాన్ని పాటిస్తూ, శాంతిని కోరుకుంటూ, హింస చేయక, ప్రతి జీవరాశికి ప్రేమను పంచడమే పరమావధిగా మానవులు మసులుకోవాలి.

-సత్యసాయి బాబా



పుట్టపర్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా.. ప్రపంచానికి ఆధ్యాత్మిక గురువు. ఆధ్యాత్మిక బోధనలతో ప్రపంచాన్ని భక్తి వైపు మళ్లించారు. విలువల జీవితాన్ని వివరించారు. మనిషికి ఆనందమయ జీవితం ఎలా సాధ్యమో వివరించారు. బోధనలు, సేవలతో అన్ని దేశాల్లో భక్తులను సంపాదించుకున్నారు. కొన్ని దేశాల అధినేతలు.. సత్యసాయి భక్తులయ్యారు. మానవాళికి బోధనలే కాదు.. మహోన్నత సేవా కార్యక్రమాలు చేశారు. తాగు నీరు, వైద్యం, విద్య తదితర ఎన్నో సేవలు చేశారు. ఎందరికో ఆరాధ్యు డయ్యారు. అలాంటి సత్యసాయి బాబా జీవితం గురించి తెలుసుకుందాం..

బాల్యం, విద్య..

1926లో పుట్టపర్తి ఓ కుగ్రామం. అలాంటి మారుమూల గ్రామంలో 1926 నవంబరు 23న పెద్దవెంకమరాజు, ఈశ్వరమ్మ దంపతులకు ఏడో సంతానంగా సత్యనారాయణ జన్మించారు. తాత కొండమరాజు భాగవత, రామాయణ, ఆధ్యాత్మిక బోధనలు చేసేవారు. సత్యనారాయణ బాల్యం నుంచి జీవుల పట్ల కరుణ, ప్రేమ చూపేవారు. మిత్రులను సైతం బాలగోపాలుడి వలె భావించేవారు. ఐదేళ్ల వయసులోనే మిత్రులకు గాలిలో చేతులు ఊపి ఆహార పదార్థాలు, పండ్లను అందించేవారు. ఇది చూసిన వారు ఇదేదో మాయ అనుకునేవారు. బుక్కపట్నం వెళ్లి పాఠశాలలో చదివేవారు. పాఠశాలకు సరిగా వెళ్లక పోవడంతో కొన్ని రోజులు పశువులు మేపేందుకు పంపారు. గ్రామ సమీపంలో ఉన్న చిత్రావతి నదిలో మిత్రులతో కలిసి ఆడుకునేవారు. అప్పట్లో ఇసుక కుప్పలు చేసుకొమ్మని చెప్పి.. అందులో నుంచి మిత్రులు అడిగినది తీసి ఇచ్చేవారని ప్రచారం. గ్రామంలో ఎక్కువ మంది సత్యనారాయణ ప్రవర్తన చూసి దెయ్యమో.. భూతమో పట్టిందని చెప్పుకునేవారు. ఈశ్వరమ్మ.. తన కుమారుడిని కదిరికి తీసుకెళ్లి భూతవైద్యుడికి చూపించారు. ఆయనపై గాట్లు పెట్టి, నిమ్మకాయ పిండి తలస్నానం చేయించారు. అయినా మార్పు రాకపోవడంతో దెయ్యం కాదనీ, ఆధ్యాత్మికతత్వం అంటూ కొంతమంది పేర్కొన్నారు. ఇంటి పక్కనే ఉన్న కరణం సుబ్బమ్మ.. సత్యనారాయణ మహిమలను చూసి, ఆకర్షితురాలయ్యారు. గొప్ప వ్యక్తి కాగలరని తన వంతు సహకారం అందించారు.

అవతార ప్రకటన

సత్యనారాయణ అన్న శేషంరాజు దగ్గర ఉంటూ ఉరవకొండలో చదువుకునేవారు. అదే సమయంలో సత్యనారాయణ ఆధ్యాత్మిక బోధనలు చేసేవారు. కొంతమంది గొప్పవ్యక్తి అంటూ పేర్కొన్నారు. అన్న మాత్రం.. తమ్ముడికి ఏదో దెయ్యం పట్టిందని అనుమానించారు. 1940 అక్టోబరు 20న ఆంజనేయులు తోటలోని బండమీద కూర్చుని తాను సాయిబాబానంటూ అవతార ప్రకటన చేశారు. ఆ తరువాత అక్కడి నుంచి పుట్టపర్తి చేరుకున్నారు.

కరణం సుబ్బమ్మ ఆశ్రయం



సత్యసాయి మహిమల పట్ల ఆకర్షితురాలైన కరణం సుబ్బమ్మ.. సామాన్య బాలుడు కాదని భావించి ఆశ్రయం కల్పించారు. బాబా కోసం ఇప్పుడున్న పెద్ద వెంకమరాజు కల్యాణమండపం ప్రాంతంలో చిన్న ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. అక్కడే బాబా ఉంటూ ఆధ్యాత్మిక బోధనలు చేసేవారు. సత్యసాయి బోధనలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు గ్రామాన్ని దాటి పట్టణాలు, రాష్ట్రాలకు విస్తరించాయి. దీంతో సుదూర ప్రాంతాల నుంచి సత్యసాయి దర్శనం కోసం ఎందరో వచ్చేవారు.

ప్రశాంతి నిలయం స్థాపన

సత్యసాయి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య పెరగడంతో మరో ఆశ్రమం నిర్మించాలనుకున్నారు. 1948 జనవరి 14న ప్రశాంతి నిలయం పేరిట భవన నిర్మాణానికి సత్యసాయి పూజలు చేశారు. అప్పట్లో రవాణా కమిషనర్ హనుమంతరావు, కొంతమంది భక్తులు పూజలో పాల్గొన్నారు. సత్యసాయి 25వ జన్మదిన వేడుక సందర్భంగా 1950 నవంబరు 23న ఆశ్రమాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి బోధనలు, ప్రసంగాలు అందించేవారు. సత్యసాయి దర్శనానికి విదేశాల నుంచి భక్తుల రాక పెరిగింది. దీంతో ప్రశాంతి నిలయం ప్రత్యేకంగా పట్టణ వాటిక ఏర్పడడమేకాక విశాలమైన దర్శన భవనాన్ని నిర్మించారు. 5 వేల మంది భక్తులు కూర్చుని సత్యసాయి దర్శనం చేసుకునే విధంగా సాయికుల్వంత్‌ను తీర్చిదిద్దారు. ఏటా నవంబరులో సాయి కుల్వంత్‌లో ఆరు రోజులపాటు సత్యసాయి జన్మదిన వేడుకలను నిర్వహించేవారు. అప్పట్లో సత్యసాయి దర్శనానికి దేశవిదేశాలకు చెందిన దేశాధినేతలు సైతం హాజరయ్యేవారు. సత్యసాయి శివైక్యం తర్వాత సాయికుల్వంత్ వేదికగా జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారు.



ప్రతి కుటుంబానికీ ఉద్యోగం

(5వ పేజీ తరువాయి)

కార్యక్రమానికి మంత్రి కేశవ్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 13 నుంచి విశాఖపట్నంలో నిర్వహించనున్న సీఐఐ సమ్మేళనం రాష్ట్ర దశ, దిశను మార్చనుందన్నారు. రూ.10 లక్షల కోట్లుపైగా విలువైన ఒప్పందాలు కుదుర్చుకుంటామన్నారు. తద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రూ.16 కోట్లతో ప్లాటెడ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తుండడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయదలచిన ప్రతి ఒక్కరికీ తగిన ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, కలెక్టర్ ఆనంద్, ఆర్డీఓ కేశవనాయుడు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నాగకుమార్, మేనేజర్లు సాయిసాగర్, శివమోహన్ కృష్ణ, స్థానిక కార్పొరేటర్ రామాంజనేయులు, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ పవన్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంగాచారి పాల్గొన్నారు.

మంత్రి కేశవ్ గురుభక్తి


గురువు గంగాధరశాస్త్రిని ఆలింగనం చేసుకున్న మంత్రి కేశవ్

పుట్టపర్తి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి విద్యాసంస్థల పూర్వ విద్యార్థి, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్.. తన గురువు ప్రొఫెసర్ గంగాధర శాస్త్రిని పుట్టపర్తిలో కలుసుకున్నారు. ఆయనకు పాదాభివందనం చేసి, గురుభక్తిని చాటుకున్నారు. ప్రశాంతి నిలయం క్యాంపస్‌లో చదువుకున్న రోజుల జ్ఞాపకాలను గురువుతో పంచుకున్నారు. తన విద్యార్థి ఆర్థిక మంత్రిగా, మంచి వక్తగా ఎదగడం గర్వంగా ఉందని గంగాధర శాస్త్రి అన్నారు. తనతో పాటు ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన గురువులు సమాజానికి మార్గదర్శకులను మంత్రి కేశవ్ అన్నారు.

శాంతి, ప్రేమను చాటాలి

(5వ పేజీ తరువాయి)

వస్తారని, అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పుట్టపర్తికి నలుదిక్కుల రోడ్డు మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

- మహా సమాధి దర్శనానికి వచ్చే భక్తులకు అన్నిసౌకర్యాలు కల్పించాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచించారు. వాహనాలకు పార్కింగ్ సమస్య లేకుండా చూడాలని అన్నారు.
- భక్తులకు గుర్తుండిపోయేలా శతజయంతి ఉత్సవాలకు నిర్వహించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి అన్నారు. పట్టణంలో చేపట్టిన పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఐజీ షిమోషి, ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, జేసీ మౌర్య భరద్వాజ్, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, ఆర్డీఓలు సువర్ణ, వీవీఎస్ శర్మ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృత పర్యటన

సత్యసాయి శత జయంతి వేడుకల ఏర్పాట్లను మంత్రుల కమిటీ పరిశీలించింది. ఈ నెల 19న ప్రధాని పర్యటన నేపథ్యంలో హిల్ వ్యూ స్టేడియంలో భద్రత, సభ ఏర్పాట్ల గురించి అధికారులతో చర్చించింది. చిత్రావతి నది, హారతి ఘాట్, చిల్డ్రన్‌పార్క్, మార్కెట్ యార్డు, ప్రశాంతి నిలయం తదితర ప్రాంతాలను పరిశీలించింది.

సత్యసాయి శతజయంతి వేడుకలకు పుట్టపర్తి సర్వాంగసుదరంగా ముస్తాబవుతోంది. ప్రశాంతి నిలయం, పుట్టపర్తి ప్రధాన రహదారులు, విద్యాసంస్థలు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ విద్యుత్ కాంతులతో దగధగలాడుతున్నాయి. పట్టణం నుంచి ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్ వరకు 9 కి.మీ. మేర రంగు రంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. లేజర్ లైట్ల వెలుగులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.


ప్రశాంతి నిలయం వద్ద గృహ సముదాయాలకు విద్యుత్ వెలుగులు

పెద్దాస్పత్రిలో క్యాన్సర్ ఓపీ

సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం


వైద్యులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్

అనంతపురం వైద్యం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, ఆదిలోనే వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం తెలిపారు. దీనికోసం పెద్దాస్పత్రిలో ఓపీ 22ను ఏర్పాటు చేసి, పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. తన కార్యాలయంలో ఆంకాలజీ, రేడియాలజీ, ఈఎన్‌టీ విభాగాల డాక్టర్లతో మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మహిళల్లో గర్భసంచి, రొమ్ము క్యాన్సర్లు సాధారణస్థాయిలో బయట పడటంలేదని అన్నారు. వ్యాధి ముదిరాక గుర్తించినా ఫలితం లేకుండా పోతోందని అన్నారు. క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించేందుకు డాక్టర్లందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి మంగళ, బుధవారాల్లో ఓపీ 22లో డాక్టర్లు అందుబాటులో ఉండి, స్క్రీనింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రేడియాలజిస్ట్ డాక్టర్ మనోరంజన్‌రెడ్డి, అంకాలజిస్ట్ డాక్టర్ ప్రశాంతి, గైనకాలజిస్ట్ డాక్టర్ సుచిత్ర, ఈఎన్‌టీ హెచ్ఓడీ డాక్టర్ రాజేష్, నోడల్ ఆఫీసర్లు గీతాంజలి, యశోధలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు 9,954 గృహ ప్రవేశాలు

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బుధవారం 9,954 గృహ ప్రవేశాలు జరుగుతాయని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల గృహప్రవేశాలను అన్నమయ్య జిల్లా రాయచోటిలో ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ప్రారంభిస్తారని తెలిపారు. ఇదే సమయంలో జిల్లాలో గృహప్రవేశాలు జరుగుతాయని అన్నారు. నియోజకవర్గస్థాయిలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. జిల్లా స్థాయి కార్యక్రమం గుత్తి పట్టణంలో జరుగుతుందని వెల్లడించారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుతమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు



అనూ ఇమ్మాన్యుయేల్

'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.



కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం

'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సేమీడియాతో పంచుకున్నారు.

- కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.
- నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.

భారీ యాక్షన్ డ్రాప్‌లో




కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది



- అక్కినేని నాగార్జున

'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్నగారి 'మూగ మనసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వెగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్లపై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్,శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చేప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు ముందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా రేలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రేలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.

క్రైం కార్నర్

గాయపడిన విద్యార్థి మృతి


రామ్‌చరణ్ (ఫైల్)

గోరంట్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి రామ్‌చరణ్ (18) చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మండలంలోని బూగానిపల్లికి చెందిన మద్దిలేటి కుమారుడు రామ్‌చరణ్ హిందూపురంలో బీటెక్ చదువుతున్నాడు. మల్లాపల్లి సమీపంలో హిందూపురం రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా, ఈనెల 7న ఉదయం గోరంట్లకు చెందిన చంద్రాయుడు ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన రామ్‌చరణ్‌ను గోరంట్ల ఆసుపత్రి నుంచి హిందూపురం, బెంగళూరుకు తరలించి చికిత్స అందించారు. ఫలితం లేకపోవడంతో చివరకు రెండురోజుల కిందట అనంతపురం తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ద్వంద్వ విధానాలతో కూటమి ప్రభుత్వం మోసం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

అనంతపురం/ప్రెస్‌క్లబ్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ద్వంద్వ విధానాలతో ప్రజలను మోసం చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య విమర్శించారు. అనంతపురంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తామని ప్రజలను నమ్మించిన చంద్రబాబు, ఇప్పుడా సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే పనిలో నిమగ్నమయ్యారని అన్నారు. ఐదేళ్లల్లో 20 లక్షల ఉద్యోగాలను సృష్టిస్తామని హామీ ఇవ్వడంతోనే సరిపెట్టారని అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ కేంద్రానికి మద్దతిస్తున్న కూటమి ప్రభుత్వం, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఎందుకు సాధించలేదని ప్రశ్నించారు. పోలవరం, అమరావతి పేరుతో వేల కోట్లు అప్పులు తీసుకొని రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రగా చేస్తున్నారని విమర్శించారు. అమరావతి పేరుతో భూదోపిడీకి తెరతీశారని ఆరోపించారు. నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు రెండేళ్లు కావస్తున్నా... అమలు చేయలేదని మండిపడ్డారు. మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయడానికి చంద్రబాబు పూనుకోవడం దారుణమని అన్నారు. ఎర్రచందనం దొంగలనే జనసేనలో చేర్చుకుంటూ, ఎర్రచందనం స్మగ్లర్లను అణచివేస్తామని పవన్ కల్యాణ్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. దేశవ్యాప్తంగా దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ పరిస్థితులను నిరసిస్తూ సామాజిక న్యాయం, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం ఈనెల 18న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేపట్టాలని ఆ పార్టీ స్థానిక కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ మాట్లాడుతూ... మొక్కజొన్న పంట నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

రైతులకు గిట్టుబాటు ధరలు, రుణమాఫీ, పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా వెంటనే చెల్లించాలని కోరారు. రైతాంగ సమస్యలు పరిష్కరించకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జాఫర్, నారాయణస్వామి, మల్లికార్జున, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆర్చరీ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్చరీ జూనియర్స్, సీనియర్స్ బాల, బాలికల ఎంపిక పోటీలు ఈనెల 13న ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. 2005 జనవరి 1లోపు జన్మించిన వారు జూనియర్స్ కేటగిరీకి అర్హులన్నారు. అర్హతగల క్రీడాకారులు తగిన పత్రాలు, క్రీడా సామగ్రితో హాజరుకావాలన్నారు. వివరాలకు సెల్ నంబరు 9949279330ను సంప్రదించాలని కోరారు.

చీనీ, టమోటా ధరలు ఇలా..




అనంతపురం రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో మంగళవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19,500తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. అలాగే కక్కలపల్లి మార్కెట్లో టామోటాలు కిలో గరిష్ఠంగా రూ.28తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.12తో, సరసరిగా రూ.20తో విక్రయాలు జరిగాయన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జడ్పీలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో మన పంచాయతీ.. మన పరిశుభ్రత కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఒక పంచాయతీ కార్యదర్శికి డీపీఆర్‌సీ రిసోర్స్ పర్సన్ ద్వారా శిక్షణ ఇప్పించారు. పంచాయతీల్లో పరిసరాల పరిశుభ్రతకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. శిక్షణలో డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ సౌజన్య, ట్రైనింగ్ మేనేజర్ నిర్మల్ దాస్, డీపీఎం అబ్జల్ పాల్గొన్నారు.

పశుకిసాన్ క్రెడిట్ కార్డుల జారీకి చర్యలు తీసుకోండి

\- జేడీ ప్రేమ్‌చంద్

అనంతపురం అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులకు పశుకిసాన్ క్రెడిట్ కార్డుల జారీకి ప్రత్యేక చొరవ చూపాలని పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్ ఆదేశించారు. స్థానిక పశుసంవర్ధక శాఖ అనంతపురం డివిజన్ కార్యాలయంలో డివిజన్ స్థాయి సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. పశుకిసాన్ క్రెడిట్ కలిగిన రైతులకు పశుపోషణ కోసం బ్యాంక్‌లు రుణం మంజూరు చేస్తాయన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అంతరిక్ష విజ్ఞాన సదస్సులో జిల్లా విద్యార్థులు

కొత్తచెరువు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): దేశరాజధాని ఢిల్లీలో ఈనెల 6 నుంచి 8తేదీ వరకు జరిగిన అంతరిక్ష విజ్ఞాన సదస్సుకు జిల్లా విద్యార్థులు ఇద్దరు హాజరైనట్లు డీఈఓ క్రిష్ణప్ప మంగళవారం తెలిపారు. లేపాక్షి మండలం శిరివరం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వతరగతి విద్యార్థి రూపిక, గోరంట్ల మండలం కొడేవాండ్లపల్లి ఉన్నతపాఠశాలకు చెందిన 9వతరగతి విద్యార్థిని వనజ జిల్లా నుంచి పాల్గొన్నారన్నారు. రాష్ట్రం నుంచి 52 మంది విద్యార్థినులు ఈ సదస్సులో పాల్గొన్నారని అయితే మన జిల్లానుంచి ఇద్దరు ఎంపిక కావడం హర్షనీయమన్నారు. వీరు నెహ్రూ ప్లానిటోరియం, అంతరిక్ష విద్యాలయం, రాష్ట్రపతి భవన్, జాతీయ సైన్స్ మ్యూజియం, రష్యన్ ఎంబసీలను సందర్శించినట్లు జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్ తెలిపారు.


విద్యార్థినులను అభినందిస్తున్న డీఈఓ కిష్టప్ప

అందరికీ ఉపాధి.. ప్రభుత్వ లక్ష్యం

● ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి
● ఎంపీ, ఎమ్మెల్యే ఫౌండేషన్ల ఆధ్వర్యంలో జాబ్‌మేళా

అనంతపురం క్రైం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. రుద్రంపేట వాల్మీకి భవన్‌లో మంగళవారం అంబికా, దగ్గుపాటి ఫౌండేషన్ల ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. హోసూరుకు చెందిన టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ....అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువత, మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించడం కోసం తరచూ జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతకు ఉపాధి కల్పించి వారి భవిష్యత్తు భద్రత కోసం తమ ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యం అన్నారు. గతంలో ఆర్ట్స్ కాలేజ్‌లో జాబ్ మేళా ద్వారా 3 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. వచ్చే జనవరిలో 100 కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. జాబ్ మేళాకు 300 మంది నమోదు చేసుకోగా...150 మంది ప్రత్యక్షంగా హాజరయ్యారు. వీరిలో 82 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఎంపీ అంబికా తెలిపారు. ఎంపికైన వారికి ఎంపీ అంబికా, ఆయన కుమారుడి చేతుల మీదుగా నియామకపత్రాలు అందించారు. కార్యక్రమంలో అంబికా వీక్షిత్, మాజీ మేయర్ స్వరూప, కంపెనీ ప్రతినిధులు ప్రవీణ్, రామ్‌కుమార్, టీడీపీ నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

25 నుంచి నీటి విడుదల

● హెచ్చెల్సీ ఎస్‌ఈ సుధాకర్‌రావు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడి కాలువకు ఈనెల 25 నుంచి నీటి విడుదల చేస్తామని హెచ్చెల్సీ ఎస్‌ఈ సుధాకర్‌రావు తెలిపారు. పీఏబీఆర్ కుడికాలువకు నీటి విడుదల, గేట్ల రిపేరీ, పిచ్చిమొక్కల తొలగింపుపై మంగళవారం తన కార్యాలయంలో ఆయన ఇంజనీర్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఐఏబీలో తీర్మానించిన ప్రకారం ఈనెల 15న పీఏబీఆర్ కుడికాలువకు నీటి విడుదల చేయాల్సి ఉండగా, పలు కారణాలతో వాయిదా వేశామన్నారు. పీఏబీఆర్ గేట్ల రిపేరి కోసం పంపిన ప్రతిపాదనలను ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రూ.29లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. దీంతో గేట్ల రిపేరితో పాటు పీఏబీఆర్ నుంచి కుడి కాలవ 25కిలోమీటరు వరకు మొదటి విడతలో పిచ్చిమొక్కల (జంగిల్ క్లియరెన్స్) తొలగింపు పూర్తి చేస్తామన్నారు. తరువాత నీటి విడుదల చేస్తామన్నారు. ఇప్పటికే రైతులు చేసిన వినతి మేరకు 49 చెరువులకు నీరు నింపడంపై సాధ్యాసాధ్యాలపై సమీక్షిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ డిప్యూటీ ఎస్‌ఈ పెంచలయ్య, డీసీ డివిజన్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.


ఇంజనీర్లతో చర్చిస్తున్న హెచ్చెల్సీ ఎస్‌ఈ సుధాకర్ రావు

రైల్వే శాఖలో సమన్వయం అవసరం

డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా


పోటీలను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): డివిజనల్ రైల్వేలోని వివిధ విభాగాల మధ్య సమన్వయం అవసరమని, అప్పుడే మెరుగైన సేవలను అందించగలమని డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రైల్వే గ్రౌండులో రైల్వే ఇంటర్ డిపార్టుమెంటల్ స్పోర్ట్స్ మీట్‌ను డీఆర్‌ఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేలో ఉన్న వివిధ శాఖల మధ్య సమన్వయం సాధించడం ద్వారా ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించవచ్చన్నారు. అది సాధించడానికి ఇంటర్ డిపార్టుమెంటల్ క్రీడలు దోహదపడతాయన్నారు. 15వ తేదీ వరకూ నిర్వహించనున్న ఆటల పోటీలను ఉద్యోగులు క్రీడాస్ఫూర్తితో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. క్రీడా కాగడాను వెలిగించిన డీఆర్‌ఎం ఆటలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించండి

రైల్వే పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లను ఆన్‌లైన్ ద్వారా సులభంగా సమర్పించవచ్చని డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో డిజిటల్ సర్టిఫికెట్లను సమర్పించే విధానాన్ని వివరించారు. కేవలం నిమిషంలోపే సెల్‌ఫోన్ ద్వారా పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లను దాఖలు చేయవచ్చని వివరించారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ పెన్షనర్ల సంఘ డివిజనల్ అధ్యక్షుడు మస్తాన్ వలి, ఏఐఆర్‌ఆర్‌ఎఫ్ డివిజనల్ అధ్యక్షుడు బీ సుంకప్ప, పింఛనుదారులు పాల్గొన్నారు.

టీడీపీ, వైసీపీ కార్యకర్తల ఘర్షణ

శింగనమల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిదనవాడ గ్రామంలో రస్తా, ఇంటి విషయంగా టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య మంగళవారం జరిగిన ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన 8 మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు నిదనవాడ గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు సత్యనారాయణరెడ్డి, పెద్దిరెడ్డికి టీడీపీ చెందిన రామకృష్ణారెడ్డి, ధనుంజయరెడ్డికి మిడ్‌పెన్నార్ ఐదో దక్షిణ కాలువపై పొలాలకు వెళ్లే రస్తా విషయంగా పలు మార్లు గొడవలు జరిగాయి. ఈ వివాదం కోర్టులో ఉంది. ఈనేపథ్యంలో సత్యనారాయణరెడ్డి సమీప బంధువుల ఇంటిని రామకృష్ణారెడ్డి కొనుగోలు చేయడంతో ఆ విషయంగా కూడా వివాదం రేగింది. మంగళవారం ఉదయం కాలువ రస్తా, ఇంటి విషయంగా మరోసారి గొడవ జరిగింది. పరస్పరం దాడులకు దిగడంతో వైసీపీ చెందిన సత్యనారాయణరెడ్డి, ప్రేమనాథ్‌రెడ్డి, పెద్దిరెడ్డి, రామకృష్ణారెడ్డి, టీడీపీకి చెందిన రామకృష్ణారెడ్డి, ధనుంజయరెడ్డి, పెద్దిరెడ్డి, నరేష్‌రెడ్డి గాయపడ్డారు. ఇరువర్గాల వారు అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై శింగనమల ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా నిదనవాడ గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగినది వాస్తవమేనన్నారు. ఇరువర్గాల పైన కేసు నమోదు చేస్తామన్నారు.

వికటించిన వైద్యం.. ఆర్‌ఎంపీతో వాగ్వాదం

యాడికి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీ వైద్యం వికటించడంతో బాధితుడు బంధువులతో కలిసి నిలదీసిన సంఘటన మంగళవారం యాడికిలో జరిగింది. వివరాలు ఇలా.. మూడునెలల కిందట నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం కౌలుపల్లె గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ యాడికిలో ఓ ఆర్‌ఎంపీని సంప్రదించాడు. మోకాళ్ల నొప్పుల నివారణకు ఇంజక్షన్లు వేయించుకున్నాడు. అవి వికటించి కాళ్లు వాపులు వచ్చి నడవలేనిస్థితికి చేరుకున్నాడు. అనంతపురంలో వైద్యులను సంప్రదించగా మోకాళ్ల నొప్పుల ఇంజక్షన్లు వికటించాయని చెప్పారన్నారు. ఆర్‌ఎంపీ వైద్యంతోనే తనకు ఇలా జరిగిందని రామచంద్రారెడ్డి తన బంధువులతో వచ్చి చికిత్స చేసిన వ్యక్తిని నిలదీశాడు. బాధితుడి బంధువులు, చికిత్స చేసిన ఆర్‌ఎంపీకి వాగ్వాదం జరిగింది. చివరికి బాధితుడికి రూ.40వేలు పరిహారం ఇచ్చేలా పంచాయితీ చేసుకున్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దడంలో అధ్యాపకులదే కీలక పాత్ర

● జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శనరావు
● ఘనంగా యూనివర్సిటీ అవార్డుల ప్రదానోత్సవం


అవార్డులు పొందిన బోధన, బోధనేతర సిబ్బందితో వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య తదితరులు

అనంతపురంరూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను బాధ్యతయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో అధ్యాపకులదే కీలక పాత్ర అని జేఎన్‌టీయూఏ వైస్ చాన్సలర్ సుదర్శనరావు అన్నారు. మంగళవారం జేఎన్‌టీయూఏలో యూనివర్సిటీ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి వైస్ చాన్సలర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్‌డీటూ వీసీ ఆచార్య దేవన్న హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం వీసీ సుదర్శనరావు మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలోని అటానమస్, ప్రైవేట్ కళాశాల టీచర్లకు, ప్రిన్సిపాళ్లకు, యూనివర్సిటీ ఉమెన్స్ కో ఆర్డినేటర్స్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్, వలంటీర్స్ పేటెంట్స్, యూనివర్సిటీ టీచర్స్‌కు అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. సమసమాజ నిర్మాణానికి అధ్యాపకులు మూల స్తంభాలన్నారు. ప్రైవేట్ కళాశాల అధ్యాపకులు వారు సాధించిన అవార్డులు, పేటెంట్స్ గురించి వర్సిటీకి సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా అధ్యాపకులు తమ దగ్గరున్న సమాచారాన్ని వర్సిటీకి అందించాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాల హెచ్‌ఓడీలు, సీనియర్ ఆచార్యులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

యూనివర్సిటీ బెస్ట్ టీచర్స్ (అటానామస్ కళాశాల)

హరినాథ్(వేము ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ చిత్తూరు), ఉమామహేశ్వరీ (శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ చిత్తూరు), ఫార్మాసూటికల్ సైన్సు...మాధవిత (శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఫార్మసీ నెల్లూరు), హరనాథ్, రాఘవేంద్ర ఫార్మాసూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ అనంతపురం, యూనివర్సిటీ ప్రిన్సిపాళ్లు..స్వర్ణలత (అన్నమాచార్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, అన్నమయ్య జిల్లా), యూనివర్సిటీ బెస్ట్ ఫిజికల్ డైరెక్టర్ వెంకటేష్(రాజీవ్ గాంధీ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల నంద్యాల), బెస్ట్ ఉమెన్ కోఆర్డినేటర్స్ వినత (ఎస్ఆర్ఐటీ, అనంతపురం), రేణుకాదేవి(వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, తిరుపతి), ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ మమత (జేఎన్‌టీయూఏ, అనంతపురం), మురళీకృష్ణ (గీతాంజలి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సు అండ్ టెక్నాలజీ నెల్లూరు), వలంటీర్లు వెంకటేష్‌నాయక్ జేఎన్‌టీయూఏ అనంతపురం, సందీప్‌కుమార్‌రెడ్డి అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల అనంతపురం.

30 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న టీచర్లు

సుదర్శనరావు సివిల్ ఇంజనీరింగ్ విభాగం, ఇన్‌చార్జ్ ఉపకులపతి జేఎన్‌టీయూఏ, భానుమూర్తి సివిల్ ఇంజనీరింగ్ జేఎన్‌టీయూఏ, ఆచార్య చంద్రశేఖర్ కెమిస్ట్రీ విభాగం జేఎన్‌టీయూఏ, విజయకుమార్ ఈఈఈ విభాగం, జేఎన్‌టీయూఏ, ఆనందరావు, సీఎస్‌ఈ విభాగం, రంగజనార్దన మెకానికల్ విభాగం, కలికిరి, ఆచార్య దేవన్న, కెమిస్ట్రీ విభాగం, జేఎన్‌టీయూఏ, సత్యనారాయణ కెమికల్ విభాగం, జేఎన్‌టీయూఏ, కృష్ణయ్య, సివిల్ విభాగం రిజిస్ట్రార్ జేఎన్‌టీయూఏ,

స్టేట్ బెస్ట్ టీచర్లు

ఆచార్య చెన్నారెడ్డి, సీఎస్‌ఈ ఇంజనీరింగ్ విభాగం, వైశాలి ఘోర్పడే సివిల్ విభాగం, జేఎన్‌టీయూఏ, దిలీప్‌కుమార్ కెమికల్ విభాగం, జేఎన్‌టీయూఏ, ఈశ్వర్‌రెడ్డి సీఎస్‌ఈ విభాగం, ఓంప్రకాష్ మెకానికల్ విభాగం, శారద కెమికల్ ఇంజనీరింగ్ విభాగం జేఎన్‌టీయూఏతోపాటు మరో 30మందికి యూనివర్సిటీ పేటెంట్స్ అవార్డులు అందజేశారు.

నలుగురికి డీసీటీఓలుగా ఉద్యోగోన్నతి

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పన్నుల శాఖలో నలుగురు ఏసీటీఓలకు డీసీటీఓలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ బదిలీ చేశారు. తాడిపత్రిలో పనిచేస్తున్న జిలాన్‌బాషాను చిత్తూరుకు, హిందూపురంలో పనిచేస్తున్న పోతులయ్యను పులివెందులకు, విజయలక్ష్మిని చిత్తూరుకు, అనిల్‌ను అనంతపురం -2కు బదిలీ చేశారు.

ఏడీఏ సనావుల్లాపై ఆర్టికల్ ఆఫ్ చార్జెస్



అనంతపురం అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కణేకల్లు ఫామ్‌లో ఏడీఏగా పనిచేస్తున్న సమయంలో సనావుల్లాపై వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం మంగళవారం ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ జారీ చేసింది. ప్రస్తుతం ఆయన శ్రీసత్యసాయి జిల్లాలో కదిరి ఏడీఏగా విధులు నిర్వర్తిస్తున్నారు. కణేకల్లు ఫామ్‌లో ఏడీఏగా పని చేసిన సమయంలో వచ్చిన ఆరోపణలపై వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఉన్నతాధికారులతో పలు దఫాలుగా విచారణ చేయించారు. ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ ఉత్తర్వులు అందిన పది రోజుల్లో వివరణ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఫామ్‌లో పండించిన వరి అమ్మకాల్లో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నట్లు పేర్కొన్నారు. స్థానిక రైతులు, కార్మికులకు రూ.40.82 లక్షలకుపైగా డబ్బులు చెల్లించలేదని అప్పట్లో స్పందన కార్యక్రమంలో బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఏడీఏ సనావుల్లాపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ జారీ చేశారు. కణేకల్లు ఫామ్‌లో సనావుల్లా ఏడీఏగా పనిచేస్తున్న సమయంలో జేడీఏలుగా పనిచేసిన చంద్రానాయక్, రామకృష్ణలను సాక్షులుగా పరిగణిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

15 రోజుల్లో సరిహద్దు సర్వే నివేదిక

డైరెక్టర్ ఆఫ్ ల్యాండ్స్, రికార్డ్స్ కూర్మనాథ్


సర్వే రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

డీ.హీరేహాళ్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మైనింగ్ కంపెనీల సరిహద్దులపై సర్వేకు సంబంధించిన నివేదికను 15 రోజుల్లో పూర్తి చేస్తామని డైరెక్టర్ ఆఫ్ ల్యాండ్స్ అండ్ రికార్డ్స్ కూర్మనాథ్ మంగళవారం పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులతో కలిసి బీఐఓపీ, ఓఎంసీ, వైఎం, అంతర్‌గంగా తదితర మైనింగ్ కంపెనీల మైనింగ్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అక్కడ జరిగిన మైనింగ్‌కు సంబంధించి అధికారులతో ఆరా తీశారు. సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసి సుప్రీంకోర్టుకు నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడ అక్రమ మైనింగ్ జరిగిందని సుప్రీంకోర్టుకు అనేక ఫిర్యాదులు అందయన్నారు. దీంతో వీటిపై నిజాలు నిగ్గు తేల్చేందుకు సుప్రీంకోర్టు దులియా కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. అందులో సభ్యుడైన తాను సుప్రీం కోర్టు ఆదేశాల్లో భాగంగా క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి వచ్చినట్లు తెలిపారు. వచ్చే 15 రోజుల్లో సర్వే ప్రక్రియను పూర్తి చేసి నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పిస్తామన్నారు. ఆయన వెంట వెంకటేశ్వరరావు ఆర్‌జేడీ కర్నూల్, నిత్యానంద్ సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధి, శ్రీనివాస్‌చౌదరి డిప్యూటీ డైరెక్టర్ మైన్స్ అండ్ జియాలజీ, సర్వేయర్ రవితేజ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

● రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు
● ఘనంగా సివిల్ సప్లయ్స్ హమాలీ యూనియన్ రాష్ట్ర మహాసభ


ప్రసంగిస్తున్న ఉమామహేశ్వరరావు

అనంతపురం టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే మార్గమని సివిల్ సప్లయ్స్ హమాలీ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు అన్నారు. యూనియన్ రాష్ట్ర ఐదో మహాసభలను నగరంలోని గణేనాయక్ భవన్‌లో మంగళవారం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. కృష్ణ అధ్యక్షత వహించారు. తొలుత అమరులకు సంతాపాన్ని ప్రకటించారు. అనంతరం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని అన్నారు. కార్మికలోకం ఐకమత్యంతో పోరాడి హక్కులను సాధించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పట్ల పాలక ప్రభుత్వాలు చిన్నచూపు చూడడం అన్యాయమనిసీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు అన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉదయ భాస్కర్ రావు, జిల్లా గౌరవాధ్యక్షుడు ఆర్‌వీ నాయుడు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర కమిటీ ఎన్నిక

ఏపీ సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర కమిటీ 25 మందితో ఎన్నికైంది. రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడిగా ఆర్.కృష్ణ, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరావు, జొన్నలగడ్డ కృష్ణ, శేఖర్, రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉదయభాస్కర్‌రావు, రాష్ట్ర కార్యదర్శులుగా రత్నరాజు, బి.రమేష్, నాగరాజు, శ్యామ్, రమేష్, కోశాధికారిగా ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా శంకర్, ఈశ్వర్, వీర్రాజు, గోపాలరావు, రాజు, శ్రీనివాస్, నరేష్, వెంకటేష్, దాదాపీరా, రాంబాబు, గోపాల్‌ను ఎన్నుకున్నారు.

పార్టీ కోసం కష్టపడిన వారందరికీ పదవులు

● రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల సునీత

అనంతపురం క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం కష్టపడిన అందరికీ కమిటీల్లో స్థానం ఉంటుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హామీ ఇచ్చారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆమె నియోజకవర్గంలోని అన్ని మండలాల క్లస్టర్ నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 13వ తేదీ కక్కలపల్లి క్రాస్‌లోని ఆర్ కన్వెన్షన్‌లో కొత్తగా ఎంపికయ్యే సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ పోలింగ్ బూత్, యూనిట్, క్లస్టర్, మండల కమిటీలకు ఎంపిక కాబోయే సభ్యులు అందరూ వచ్చేలా చూడాలన్నారు. పార్టీ అధిష్ఠానం ఐవీఆర్ఎస్ ద్వారా అన్ని మార్గాల్లో పరిశీలించి కష్టపడిన ప్రతి ఒక్కరికీ కమిటీల్లో చోటు కల్పిస్తుందని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన పరిశ్రమల బోర్డు సభ్యుడు..

ఏపీ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు సభ్యులుగా ఎంపికైన వెంకటనారాయణ ఎమ్మెల్యే పరిటాల సునీతను క్యాంపు ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కుంటిమద్ది విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీడీ తదితరులు

రామగిరి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటిమద్ది ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ, హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం అనంతపద్మనాభం, పీడీ చిత్రాటబుశేశు తెలిపారు. పాఠశాలలో మంగళవారం వారు మాట్లాడుతూ.. అనంతపురంలోని ఆర్డీటీ క్రీడామైదానంలో గత సోమవారం జరిగిన స్కూల్ గేమ్స్ పోటీలలో అండర్-17 హాకీ విభాగంలో సాత్విక్, అండర్-17 హ్యాండ్‌బాల్ విభాగంలో పవన్‌కుమార్ సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 23వ తేదీన పులివెందుల, తెనాలిలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్, హాకీ పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొనున్నట్లు తెలిపారు. అనంతరం ఆ విద్యార్థులను హెచ్ఎం, పీడీతో పాటు స్కూల్ కమిటీ చైర్మన్ జగన్నాథ, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం



పాస్టర్‌కు చెక్కును అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

అనంతపురం రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం మండలంలోని కక్కలపల్లిరోడ్డులో గల కల్వరి గ్రేస్ చర్చిలో మంగళవారం అసోసియేషన్ అధ్యక్షుడు నెహెమ్యా నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా తొలుత అందరూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పోలేపల్లి పాస్టర్ శామ్యూల్ కంటి వైద్యం నిమిత్తం రూ.3వేల చెక్కును అందజేశారు. అలాగే ఉరవకొండ కరగ ముక్కల గ్రామంలో చర్చి నిర్మాణానికి రూ.30వేలు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మార్కు, కార్యదర్శి ఆనంద్, సహాయ కార్యదర్శి మనష్షే, కోశాధికారి జీవన్‌బాబు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు



జడ్పీ హైస్కూల్లో ఏర్పాటైన ఆధార్ కేంద్రం

శింగనమల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల కోసం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ చొరవతో అధికారులు మంగళవారం ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని పాఠశాలల్లో విద్యార్థుల ఆధార్ కార్డులలో ఏవేని వివరాలు మార్పులు చేయాలన్నా, అప్డేట్ చేయాలన్నా.. మండలంలో ఎక్కడా ఆధార్ కేంద్రం లేదు. దీంతో ఇబ్బందులు ఎదురవుతుండడంతో విద్యార్థులు తల్లిదండ్రులు విషయాన్ని ఇటీవల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఎంపీడీఓ భాస్కర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన వారు శింగనమల పాఠశాలలో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

అనంతపురం రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 13వ తేదీన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ అనంతపురం డివిజన్ ఈఈ జేవీ రమేష్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. కూడేరులోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థకు చెందిన అధికారులు, సిబ్బంది హాజరవుతారని అన్నారు. వినియోగదారులు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయాలని కోరారు.

భక్త కనకదాస జయంతికి తరలిరండి

శింగనమల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో జరిగే భక్త కనకదాస జయంతిని విజయవంతం చేయాలని కురబ సంఘం మండల నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 16న జరిగే కనకదాస జయంతి ఉత్సవాలపై కురబ సంఘం నాయకులు మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్థానిక ఆత్మారామస్వామి ఆలయంలో కనకదాస జయంతి నిర్వహిస్తామన్నారు. పెద్దఎత్తున కురబలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సంఘం మండల అధ్యక్షుడు మంకెర నాగేంద్ర, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బ్యాళ్ల నాగేంద్ర, నాయకులు పట్నంనగేష్, చలపతి, చంద్రాయుడు, పోతలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ పరీక్షల కేంద్రం దగ్ధం

రూ.5 కోట్ల వరకు నష్టం?
ప్రమాదమా..? కుట్రా..?
వైద్యవర్గాల్లో అనుమానాలు



దగ్ధమైన యంత్రాలు, ఉపకరణాలు

అనంతపురం వైద్యం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ కేంద్రం దగ్ధమైంది. ల్యాబ్ నుంచి మంగళవారం ఉదయం పొగలు వస్తుండంతో సిబ్బంది గమనించి, ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ల్యాబ్‌లోని యంత్రాలు, వాటి ఉపరణాలు, ఫ్రిడ్జ్‌లు కాలిపోయాయి. ఏసీలో మంటలు చెలరేగి గదులన్నింటికి వ్యాపించాయని అధికారులు తెలిపారు. ఈ ఘటనతో రూ.5 కోట్ల వరకు నష్టం జరిగిందని ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఇది ప్రమాదమా..? ఉద్దేశపూర్వకంగా చేశారా..? అన్న అనుమానాలను వైద్యవర్గాలు వ్యక్తంచేస్తున్నాయి.

కీలకమైన ల్యాబ్

ల్యాబ్‌లో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. ఇందులో కీలకమైన క్లస్టర్ డిఫరెన్సియేషన్(సీడీ-4) యంత్రం, వైరల్ లోడ్ ఎస్టిమేషన్(వీఎల్ఈ) పరీక్షలు నిర్వహించే పాలిరేజ్ చైన్ రీయాక్షన్ యంత్రం తదితరాలు దగ్ధమయ్యాయి. ఈ గది పై అంతస్తులో రూ.10 కోట్ల విలువైన వైరల్ రీసర్చ్ డయోగ్నస్టిక్ ల్యాబోరేటరీ (వీఆర్‌డీఎల్) కేంద్రం ఉంది. మంటలు పైకి పాకివుంటే పెనుప్రమాదమే జరిగి ఉండేదని అధికారులు ఆందోళన వ్యక్తంచేశారు. హెచ్ఐవీ మినహా వైరస్‌కు సంబంధించి పదుల రకాల వ్యాధుల నిర్ధారణ పరీక్షలు వీఆర్‌డీఎల్ కేంద్రంలోనే నిర్వహిస్తారు.

పర్యవేక్షణ లోపంతోనే..

నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నిధులతో ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీని (ఏపీసాక్స్) ఏర్పాటు చేశారు. ఈ సొసైటీ ఆధ్వర్యంలోనే రూ.5 కోట్లు వెచ్చించి ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షల కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాన్ని మైక్రోబయాలజీ డిపార్ట్‌మెంట్‌తోపాటు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎయిడ్స్ కంట్రోల్ ప్రివెన్షన్ యూనిట్(డాప్‌క్యూ) పర్యవేక్షిస్తున్నాయి. పర్యవేక్షణ లోపంతోనే ల్యాబ్ కాలి బూడిదైందని వైద్యవర్గాలు మండిపడుతున్నాయి.

షార్ట్ సర్క్యూట్‌పై అనుమానాలు..

అత్యుత్తమమైన నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్న ల్యాబోరేటరీలకు నేషనల్ అక్రెడిటెడ్ బోర్డ్ ఆఫ్ ల్యాబోరేటరీ(ఎన్ఏబీఎల్) అనే జాతీయ సంస్థ సర్టిఫికెట్‌ను మంజూరు చేస్తుంది. ఈ సర్టిఫికెట్‌ను గత నెలలోనే రెన్యువల్ చేసింది. ఇలాంటి ప్రమాణాలున్న ల్యాబ్‌లో షార్ట్‌సర్క్యూట్ జరగడంపై పలు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

పరిశీలించిన అధికారులు..

జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ జయలక్ష్మి, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెకంటరత్నం, మైక్రో బయాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ శాంతిరెడ్డి ల్యాబ్‌ను పరిశీలించారు. ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు నష్టాన్ని లెక్కిస్తారని వైద్యశాఖ అధికారులు తెలిపారు.

ఇల్లు మంజూరయ్యేదెన్నడో?

- దరఖాస్తుదారుల ఎదురుచూపు
- నియోజకవర్గవ్యాప్తంగా 6,030 మంది దరఖాస్తు
- ఇప్పటి వరకు కేవలం 56 మందికే మంజూరు
- మిగతావారికి త్వరలోనే అవుతాయంటున్న అధికారులు



శింగనమలలో సగంలో ఆగిన ఓ ఇంటి నిర్మాణం

శింగనమల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చాలామంది ప్రజలు సొంత ఇంటి కల నేరవేర్చుకునేందుకు ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సొంత స్థలాలు ఉన్న వారు ఇంటి నిర్మాణం చేపట్టేందుకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. దీంతో గ్రామాల్లో గృహాలు నిర్మించుకునేందుకు చాలామంది ముందుకు వచ్చా రు. నియోజకవర్గంలోని 6 మండలాల్లో 6,030 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అయితే ఇటీవల కేవలం 56 మందికి మాత్రమే ప్రభు త్వం ఇళ్లను మంజూరు చేసింది. ఇక మిగతా వారు ఎప్పుడెప్పుడా అని వేచి చూస్తున్నారు. గృహనిర్మాణ వ్యయాన్ని ప్రభుత్వం పెంచింది. గతంలో గృహ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.1.50 లక్షలు మాత్రమే అందేది. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో గృహ నిర్మాణానికి రూ.2.50 లక్షలు వస్తోందని అంచల్లో దరఖాస్తుదారులు ఉన్నారు. అందుకే ఇళ్ల మంజూరు కోసం ఎదురు చూస్తున్నారు.

మంజూరు కాకనే చాలాచోట్ల నిర్మాణాలు మొదలు

ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తులు చేసుకుని 6 నెలలైంది. కాగా దరఖాస్తు చేసుకునే సమయంలోనే చాలా మంది దరఖాస్తుదారులు ఇళ్లు మంజూరవుతాయనే గట్టి నమ్మకంతో ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టారు. కొన్ని గృహాలు ఇప్పటికే పూర్తయ్యాయి కూడా. మరికొందరు డబ్బులు లేక సగంలో నిర్మాణం నిలిపేశారు. నిర్మాణం స మయంలో ప్రభుత్వం నుంచి సహకారం వస్తే అవి ఉపయోగపడుతుందనే అంచనాలో చాలా మంది ఉన్నారు. ఒక గృహ నిర్మాణానికి ఎంత తక్కువ లెక్క వేసుకున్నా రూ.6 లక్షల నుంచి 8లక్షలకు పైగా ఖర్చు అవుతోంది. దానిలో ప్రభుత్వం అందించే రూ.2.50 లక్షలు తమకు ఎంతో ఆసరాగా నిలుస్తాయని దరఖాస్తుదారులు అంటున్నారు.

మండలాల వారీగా దరఖాస్తులు..

నియోజకర్గంలోని మండలాల వారిగా దరఖాస్తులను పరిశీలిస్తే.. బుక్కరాయసముద్రం మండలంలో 930 మంది, గార్లదిన్నెలో 995 మంది, నార్పలలో 1402 మంది, పుట్లూరులో 1055 మంది, శింగనమలలో 655 మంది, యల్లనూరులో 1028 మంది చొప్పున మొత్తం 6030 మంది ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్నారు.

దరఖాస్తులను పై అధికారులకు పంపాం..

నియోజకవర్గంలో 6 మండలాల్లో 6030 మంది అర్హత ఉన్న వారు ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే పైఅధికారులకు ప్రతిపాదనలు పంపగా కేవలం శింగనమల మండలంలో 52 మందికి, గార్లదిన్నెలో నలుగురికి ఇళ్ల మంజూరయ్యాయి. మిగిలిన వారికి త్వరలోనే మంజూరు అవుతాయి.

- రామ్మూర్తి, హౌసింగ్ డీఈ

ఫైర్ స్టాప్ సిలిండర్ పేలి వ్యక్తి మృతి



మృతుడు జిలాన్‌బాషా (ఫైల్)



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, సిబ్బంది

అనంతపురంక్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని తపోవనంలో దారుణం చోటుచేసుకుంది. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మంటలు ఆర్పివేసేందుకు ఉపయోగించే ఫైర్ స్టాప్ సిలిండర్(ఫైర్ ఎక్స్‌టింగ్విష్ సిలిండర్) మంగళవారం పేలడంతో ఓ వ్యక్తి మరణించాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గుంతకల్లుకు చెందిన షేక్ జిలాన్ బాషా(29) తపోవనంలో ఖాళీ సిలిండర్ల డ్రై కెమికల్ ఫౌండర్, ఇతర గ్యాస్‌లను నింపుతుండగా.. ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. ఈ ప్రమాదం దాటికి అతడి కాళ్లు, కడుపు ఇతర భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని స్థానికులు ఆటోలో ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మరణించాడు. బాంబ్ పేలినట్లుగా శబ్దం రావడంతో స్థానికులు భయకంపితులయ్యారు. జిలాన్ బాషాకు భార్య, ఒక కుమారుడు ఉన్నాడు. పేలుడు విషయం తెలుసుకున్న అనంతపురం డీఎస్పీ శ్రీనివాసులు, నాలుగో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. పేలుడు ఎలా జరిగిందన్న దానిపై ఇప్పటి వరకూ పోలీసులు సైతం స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. అయితే ఈ సిలిండర్ల రీ-ఫిల్లింగ్, అమ్మకాలకు సంబంధించిన లైసెన్సు కూడా లేదని తెలుస్తోంది. మరో వ్యక్తి నిర్వహిస్తుండగా, ఆయన వద్ద జిలాన్ పనిచేస్తున్నారన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఇప్పటి వరకూ ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి

● నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి వేడుకలను కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో మంగళవారం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ శివనారాయణ్‌శర్మ, డీఆర్ఓ మలోల, మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రామసుబ్బారెడ్డి, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మౌలానా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీ మాట్లాడుతూ... స్వాతంత్రోద్యమంలో మౌలానా అనేక పోరాటాల్లో పాల్గొన్నారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... హిందూ ముస్లింల ఐక్యత కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రావడంలోనూ కీలకపాత్ర పోషించారన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ తొలి విద్యాశాఖామంత్రిగా దేశానికి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన టీచర్లను సన్మానించారు. ప్రతిభావంతమైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, డిక్షనరీలు పంపిణీ చేశారు. డీవీఎంసీ మెంబర్ ఎంఎండీ ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

●అనంతపురం న్యూటౌన్: స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలు జడ్పీ సీఈఓ శివశంకర్ ఆధ్వర్యంలో జరిగాయి. ముఖ్య అతిథిగా చైర్‌పర్సన్ గిరిజమ్మ హాజరై అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేశానికి ఆయన చేసిన సేవల్ని కొనియాడారు. ఏఓ విజయ్‌భాస్కర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

●అనంతపురంరూరల్: జేఎన్‌టీయూఏ పరిపాలన భవనం, ఇంజనీరింగ్ కళాశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వర్సిటీ వైస్ చాన్సలర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్‌డీటూ వీసీ ఆచార్య దేవన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు భానుమూర్తి, సత్యనారాయణ, సుబ్బారెడ్డి, సుజాత, ప్రశాంతి, పద్మసువర్ణ, కిరణ్మయి, నాగప్రసాద్ నాయుడు, దుర్గాప్రసాద్, చిత్ర, శోభా బిందు, నారాయణరెడ్డి, శివకుమార్, శంకర్‌శేఖర్ రాజు, అంకారావు, పీఆర్ఓ ఓంప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర తదితరులు పాల్గొన్నారు.



జడ్పీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ గిరిజమ్మ



జేఎన్‌టీయూఏలో వీసీ, రిజిస్ట్రార్, డైరెక్టర్ల నివాళి

ప్రజా సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం తగదు

● అధికారులపై ఏఎంసీ కమిషనర్ బాలస్వామి ఆగ్రహం



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వినతిపత్రాల ద్వారా వచ్చిన ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని.. అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం ఆయన పీజీఆర్ఎస్‌లో వినతుల ద్వారా వచ్చిన సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ నుంచి సాధారణంగా వచ్చే వినతులను పూర్తి స్థాయిలో పరిశీలించాలని, తర్వాత ఆయా విభాగాలకు పంపించి పరిష్కారం అయ్యే వరకు వెంటబడాలని సూచించారు. సమస్య పూర్తిగా పరిష్కారం కాకుండా అయినట్లు అర్జీదారులకు మెసేజ్ పంపకూడదని తెలిపారు. ప్రధానంగా పునరావృతమయ్యే సమస్యను ఏ విభాగానికి సంబంధించింది అయితే ఆ అధికారికి నోటీసు ఇవ్వాలన్నారు. నగరంలో పారిశుధ్యం, రోడ్ల సమస్యలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేయని అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యల పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డిప్యూటీ కమిషనర్ పావని, ఎస్ఈ రాజశేఖర్, ఎంహెచ్ఓ నరసింహులు, ఈఈలు షాకీర్, చంద్రశేఖర్, మేనేజర్ ఖయ్యూం, డీఈలు, ఏఈలు, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనంతలక్ష్మి విద్యార్థికి అవార్డు



విద్యార్థికి అవార్డు అందిస్తున్న జేఎన్‌టీయూఏ వీసీ, రిజిస్ట్రార్

అనంతపురంరూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటుకలపల్లి వద్దనున్న అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థి ఎం.సందీప్ కుమార్‌రెడ్డి జేఎన్‌టీయూఏ బెస్ట్ ఎన్ఎస్ఎస్ వలంటీర్ అవార్డు 2025ను అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థిని కళాశాల చైర్మన్ అనంతరాముడు, వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు మంగళవారం అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కళాశాలలో ఎన్ఎస్ఎస్ అధికారి మనోహర్ ఆధ్వర్యంలో కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. సమాజ సేవ పట్ల సందీప్ చూపిన నిబద్ధతను గుర్తించి జేఎన్‌టీయూఏ వీసీ, రిజిస్ట్రార్ ఈ అవార్డును అందజేశారన్నారు. కళాశాల విద్యార్థి ఇలాంటి ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకోవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు.

వీఆర్వోల మండల కమిటీ ఎన్నిక

కనగానపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ అధికారుల మండల కమిటీని మంగళవారం మండలకేంద్రంలో వీఆర్వోలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెన్నకేశవులు, ఉపాధ్యక్షురాలిగా శ్వేత, కార్యదర్శులుగా మారుతీ ప్రసాద్, పెద్దన్న, తలారి చంద్రను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను ఆర్ఐ సరళ తదితరులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనుంపల్లి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. బుక్కరాయసముద్రం మండలం కేకే అగ్రహారానికి చెందిన ఆదినారాయణ, మరొకరు కలిసి బైక్‌పై పామిడి నుంచి గార్లదిన్నె వైపు వస్తున్నారు. కనుంపల్లి గ్రామ సమీపంలోకి రాగానే.. వెనుక గ్యాస్‌సిలిండర్ల లోడు లారీ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు వెంటనే 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మన డబ్బులు-మన లెక్కలు.. అవగాహన



యానిమేటర్లతో మాట్లాడుతున్న ఏపీఎం

శింగనమల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం మన డబ్బులు,మన లెక్కలు యాప్‌పై ఏపీఎం ఈశ్వరయ్య యానిమేటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. ఈ యాప్ ద్వారా మహిళా సంఘాలకు సంబంధించి డబ్బులు, లెక్కల వివరాలు తెలుసుకోవచ్చునని తెలిపారు. సంఘాల సభ్యుల అప్పులు కూడా తెలుసుకోవచ్చన్నారు. అలాగే వారు ఏవైనా ఉత్పతులు తయారు చేస్తుంటే వాటి వివరాలు యాప్‌లో అప్లోడ్ చేయవచ్చని అన్నారు. ఈ యాప్‌ను మహిళ సంఘాల సభ్యులు వినియోగించుకోవాలని సూచించారు.

దాతల ప్రోత్సాహంతో మెరుగైన సేవలు

●పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం



మదర్ బ్రెస్ట్ పంప్ కిట్లను అందజేస్తున్న ఎస్ఎల్వీ సర్జికల్ సిబ్బంది

అనంతపురం వైద్యం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పేదలకు మెరుగైన సేవలందించేందుకు దాతల ప్రోత్సాహం మరువలేనిదని సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఆస్పత్రిలోని అనంత మదర్ మిల్క్‌బ్యాంక్‌కు మంగళవారం ఎస్ఎల్వీ సర్జికల్ యాజమాన్యం మదర్ బ్రెస్ట్‌పంప్ కిట్లను వితరణ చేశారు. వాటిని స్వీకరించిన డాక్టర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. మదర్ మిల్క్‌బ్యాంక్ ద్వారా నవజాత శిశువులకు తల్లిపాలను అందించనున్నట్లు తెలిపారు. తద్వారా వారి ఆరోగ్యాన్ని పరిరక్షించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, గైనకాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. అరటి..!

● భారీగా పడిపోయిన ధర ● పంటను పారేస్తున్న రైతులు

యాడికి, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలో పలువురు రైతులు ఏడాదిగా రూ. లక్షల వెచ్చించి.. అరటిని సాగు చేశారు. మహారాష్ట్రలో అరటి దిగుబడి ఎక్కువగా ఉండడం, అరబ్ దేశాలకు ఎగుమతులు తగ్గిపోవడంతో అరటి ధర దారుణంగా పడిపోయింది. దీంతో పలువురు రైతులు పంటను అలాగే వదిలేశారు. మరికొందరు పంటను పశువుల కోసం రోడ్డు పక్కన పడేస్తున్నారు. మండలంలోని రామరాజుపల్లి రైతు చరణ్ అరటి పంటను ట్రాక్టర్‌లో తరలించి మంగళవారం రోడ్డు పక్కన ఇలా పడేసి వెళ్లగా.. అటువైపు వెళుతున్న గొర్రెలు, మేకలు ఆ పంటను తినడం కనిపించింది.


రోడ్డు పక్కన పారేసిన అరటి కాయలను తింటున్న గొర్రెలు



విడపనకల్లులో అమ్మవారిని ఊరేగిస్తున్న గ్రామస్థులు, గోవిందవాడలో అమ్మవారికి చక్కెర హారతులు సమర్పించడానికి వచ్చిన మహిళలు

ఘనంగా గౌరమ్మ నిమజ్జనం

విడపనకల్లు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గౌరమ్మ వేడుకల్లో భాగంగా మండలంలోని హావళిగిలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజామున వరకు గౌరమ్మ దేవికి మంగళ హారతుల కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని పూల రథంలో ఊరేగించారు. గ్రామంలోని చెరువు వద్ద ఉన్న బావిలో అమ్మవారిని నిమజ్జనం చేశారు.

● బొమ్మనహాళ్ : మండలంలోని గోవిందవాడలో కడ్లేగౌరమ్మకు చక్కెరహారతుల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు, యువతులు కడ్లేగౌరమ్మకు పసుపు, కుంకుమ, గాజులు, ఒడిబియ్యం సమర్పించి పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. వేలాది మంది అమ్మవారిని దర్శించుకున్నారు. టీడీపీ నాయకులు సోమనాథ్‌గౌడ్, రాతింటి వన్నూరుస్వామి, సుంకన్న, ఎస్‌జీ వన్నూరుస్వామి, బంగిలోకేష్, నటరాజ్ పాల్గొన్నారు.

కసాపురంలో మరిన్ని వసతి గదులు


స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు, దాతలు

గుంతకల్లు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం 91 వసతి గదులను దాతల సహకారంతో నిర్మిస్తున్నట్లు టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి తెలిపారు. అప్పుడే 23 గదులకు 23 మంది దాతలు ముందుకు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. మంగళవారం దేవస్థాన ఆవరణలో ఆ దాతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వితరణ మొత్తాన్ని మూడు విడతలుగా చెల్లించడానికి దాతలు అంగీకరించినట్లు తెలిపారు. అనంతరం ఈఓ విజయరాజు, ధర్మకర్త సుగుణమ్మ, దాతలతో కలసి వెళ్లి వసతి గదులు నిర్మించే స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట తహసీల్దారు రమాదేవి, టీడీపీ నాయకులు తలారి మస్తానప్ప, జీ కొట్టాల సురేశ్, యుగంధర్ ఉన్నారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఏకగ్రీవం


నాయీబ్రాహ్మణుల నూతన కమిటీ సభ్యులు

బొమ్మనహాళ్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానికంగా మంగళవారం నిర్వహించిన సమావేశంలో మండల నాయిబ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎం. శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా కొండన్న, వన్నూరుస్వామి, వెంకటేశులు, కార్యదర్శిగా బండూరు తిప్పేస్వామి, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాసులు, నరసింహులు, రామంజనేయులు, కోశాధికారి నెట్టికల్లు మరో తొమ్మిది మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కవేట్ల శ్రీనివాసులు, జిల్లా సంయుక్త కార్యదర్శి కళేకుర్తి కేశవులు తెలిపారు. ఇందులో మాజీ అధ్యక్షులు బీమన్న, రాజన్న పాల్గొన్నారు.

● **ఏపీఎన్‌జీఓ కార్యవర్గం..**

రాయదుర్గంరూరల్: స్థానిక ఏపీఎన్జీఓ భవనంలో రాయదుర్గం యూనిట్ కార్యవర్గానికి మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. ఎన్జీఓ శాఖలో 11 పోస్టులకు 11 మంది నామినేషన్లు దాఖలు చేయడంతో వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి వెంకటేష్‌బాబు తెలిపారు. అధ్యక్షుడిగా కెంచే లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కిషోర్‌బాబు, సహాయ అధ్యక్షుడిగా రామాంజినేయులు, ఉపాధ్యక్షులుగా వీరేష్, శ్రావణ్‌కుమార్, పీ రవికుమార్, సహాయ కార్యదర్శులుగా గంగాధర్‌గౌడ్, హనుమాన్, జీ రావు, వై కృష్ణమోహన్, ఏఎల్ పద్మావతి, వై సురేష్ ఎన్నికయ్యారు.

ఘనంగా టిప్పు సుల్తాన్ జయంతి

గుత్తి,నవంబరు11(ఆంధ్రజ్యోతి): స్థానిక గుత్తికోట వద్ద స్థానిక గుత్తికోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో టిప్పుసుల్తాన్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో గుత్తి కోట సంరక్షణ సమతి అధ్యక్షుడు విజయ్ భాస్కర్, నాయకులు హుసేన్‌పీరా, హెచ్‌ఎం రసూల్, కదిర్, అన్వర్, అబ్దుల్, మహమ్మద్, మాబు, షఫి పాల్గొన్నారు.

గంగమ్మకు బోనాలు


బాలాపురంలో బోనాలతో మహిళలు

పుట్లూరు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలాపురంలో మంగళవారం అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ గోపురాన్ని నిర్మించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక

రాయదుర్గం రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 సంవత్సరానికి ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతపురం ఆరో ఆంధ్ర బెటాలియన్ నుంచి సుబేదార్లు రాజేష్, కైలాస్ 21 మంది క్యాడెట్లను ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు.

పాఠశాలకు పరికరాల అందజేత


టీవీలు, ప్రింటర్‌ను అందజేస్తున్న నాయకులు

వజ్రకరూరు(ఉరవకొండ), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని చాయాపురం ప్రాథమికోన్నత పాఠశాలకు ఇన్నోబాక్స్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సీఈఓ కాకర్ల మురళీమోహన్ రూ.50వేలు విలువ చేసే పరికరాలను అందజేశారు. ఆ పాఠశాలలో మంగళవారం ఎంఈఓలు తిమ్మప్ప, ఎర్రిస్వామి, టీడీపీ నాయకులు మనోహర్ హెచ్‌ఎంకు వాటిని అందించారు.

ఎడాపెడా విద్యుత్ కోతలు

ఎండుతున్న పంటలు


ఎండుముఖం పట్టిన వేరుశనగ పంట

శెట్టూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెడాపెడా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. కరెంటు ఎప్పుడొస్తుందో... ఎప్పుడు పోతుందో.. తెలీక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజుల నుంచి అధికారులు పగటిపూట ఎటువంటి సమాచారమూ లేకుండా విద్యుత్‌కోతలు విధిస్తున్నారు.వ్యవసాయ బోరుబావుల కింద సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా తాగునీటి కోసం గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వేళల ప్రకారం విద్యుత్ కోతలు విధించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

విడపనకల్లు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 23 మంది విద్యార్థులకు విశ్రాంత ఈఓఆర్డీ చంద్రశేఖరయ్య రూ. 23 వేలు విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను మంగళవారం పంపిణీ చేశారు.

● మరుగుదొడ్లను బాగుచేయించిన హెచ్‌ఎం

మండలంలోని కరకముక్కల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అజ్మతుల్లా బాషా తన సొంత డబ్బు దాదాపుగా రూ.30 వేలతో వాటికి మరమ్మతులు చేయించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.


స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న విశ్రాంత ఈఓఆర్డీ

అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి

రాయదుర్గం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అబుల్ కలాం ఆజాద్ జయంతిని (జాతీయ విద్యా దినోత్సవం) స్థానిక జామియా మహమ్మదీయ అరబిక్ మదరసా ప్రాంగణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యలో ప్రతిభ చాటిన పదిమంది విద్యార్థులకు, ఉర్దూ మీడియంలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు జ్ఞాపికలను అందించారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు కడ్డిపూడి మహబూబ్‌బాషా, జావీద్, జిలాన్, బండి చిన్న, పొరాళ్ల పురుషోత్తం, గాజుల వెంకటేశులు పాల్గొన్నారు.

● తాడిపత్రి: మౌలానా అబుల్‌కలాం ఆజాద్ 138వ జయంతి సందర్భంగా స్థానిక సీబీరోడ్డులోని పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాత ఈద్గాలో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు నోటుపుస్తకాలు అందించారు.



రాయదుర్గం: స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న విప్ కాలవ


తాడిపత్రి: విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

న్యూస్ బాక్స్

దరఖాస్తుల ఆహ్వానం

బొమ్మనహాళ్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుబ గుడికట్లు ఆలయాలకు దూపదీప నైవేద్యానికి దరఖాస్తులు చేసుకోవాలని బొమ్మనహాళ్ దేవదాయ శాఖ ఇన్‌చార్జ్ ఈఓ బాబు మంగళవారం తెలిపారు. వివరాలకు 9849135165 నంబరులో సంప్రదించాలన్నారు.

నేడు ప్రత్యేక విద్యుత్ లోక్ అదాలత్

పెద్దవడుగూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దీర్ఘకాలికంగా పరిష్కారంకాని సమస్యలపై గుంతకల్లు పట్టణంలోని డిప్యూటీ ఇంజనీర్ కార్యాలయంలో ప్రత్యేక విద్యుత్ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఏఈ షఫి తెలిపారు. రైతులు, ప్రజలు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా ఫిర్యాదుచేయాలని సూచించారు.

నేడు టీడీపీ, వైసీపీ పోటాపోటీగా కార్యక్రమాలు

తాడిపత్రి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీడీపీ ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి పోటాపోటీగా బుధవారం కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జేసీ అశ్మిత్‌రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు. పెద్దారెడ్డి వైసీపీ మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణపై నిరసన ర్యాలీ నిర్వహించనున్నారు. కార్యక్రమాల్లో భారీ ఎత్తున అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఇరు పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. ఇప్పటికే భారీ ఎత్తున ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు పట్టణానికి చేరుకున్నారు. దీంతో ఎప్పుడు.. ఏమి జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శనగపచ్చ పురుగును నివారించుకోండి

పుట్లూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పప్పుశనగ పంటలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో శనగపచ్చ పురుగు ఎక్కువగా చేరే అవకాశముందని, దాన్ని వెంటనే నివారించుకోవాలని ఏడీఏ రవి, రేకులకుంట శాస్త్రవేత్తలు నరసింహులు, లక్ష్మణ్, జాహ్నవి సూచించారు. మండలంలోని కడవకల్లు, చెర్లోపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో వారు మాట్లాడారు. తేమ ఆరిన వెంటనే లీటర్ నీటిలో రెండు గ్రాములు సాప్‌ను కలిపి పిచికారి చేయాలన్నారు. ఎమామెక్టిన్ బెంజోయేట్ లేదా క్లొరాంట్రనిలిప్రోల్ పిచికారి చేయాలని సూచించారు.

● **ఆముదం పంటకు ..**

కూడేరు: ఆముదం పంటకు పచ్చపురుగు, పొగాకులద్దె పురుగు సోకుతోందని, ఎమామెక్టిన్‌బెంజోయేట్ మందు పిచికారి చేయడం ద్వారా దాన్ని నివారించుకోవచ్చని ఏఓ శుభకర్ తెలిపారు. మండలం ఉదిరిపికొండలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులకు అవగాహన కల్పించారు.

● **కంది పంటకు ..**

గుంతకల్లుటౌన్: కంది పంటకు ప్రస్తుతం మారుకా మచ్చల పురుగు, పచ్చపురుగు ఆశించిందని, వాటి నివారణకు 350 ఎంఎల్ ప్లేతోర మందును ఒక ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పదిరోజులకోకసారి ఆరుసార్లు పిచికారి చేయాలని మండల వ్యవసాయ అధికారి లీనా వసుంధర సూచించారు. మండలంలోని దోసులుడికి, సంగాల గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మొక్కజొన్న పంటకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములను ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు.

విద్యార్థినులకు కంటి పరీక్షలు

బెళుగుప్ప, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీలో స్కూలు హెల్త్ ప్రోగ్రామ్ కింద విద్యార్థినులకు మంగళవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఎస్‌ఓ నాగరత్నబాయి, డాక్టర్ కార్తీక్ రెడ్డి, సూపరింటెండెంట్ సీహెచ్‌ఓ పద్మావతి, పీహెచ్‌ఎన్ సరోజమ్మ, ఏఎన్‌ఎం అనురాధ, వెంకటరమణ పాల్గొన్నారు.

భూదందాలను అడ్డుకోండి: టీడీపీ

పుట్లూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఓ వ్యక్తి మండలంలో వైసీపీ నాయకుల అండతో భూదందాలకు పాల్పడుతూ.. శాంతిభద్రతలకు భంగం వాటిల్లేలా చేస్తున్నాడని టీడీపీ నాయకుడు రామాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆ పాలకొల్లు వాసి మండలంలో వందల ఎకరాలు కొనుగోలుచేశాడని, కొన్ని గ్రామాల్లో తాకట్టులో ఉన్న భూములను సైతం అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని, భూమి హెచ్‌ఆర్ నకళ్లలో ఒక పేరు ఉండగా మరొక పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని అన్నారు. 2019 ఎన్నికల్లో ఆ వ్యక్తి వైసీపీ అభ్యర్థికి ఆర్థికంగా కూడా సహకరించాడనే ఆరోపణలున్నాయన్నారు. ప్రస్తుతం ఆ వ్యక్తి ఓ మంత్రి పేరు చెబుతూ.. వైసీపీ నాయకుల అండతో ఆ భూములను విక్రయిస్తూ సొమ్ము చేసుకొంటున్నాడని అన్నారు. ఈ విషయాన్ని పూర్తి సాక్ష్యాధారాలతో పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

గుత్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పుత్తూరు కోర్టులో న్యాయవాది రాజశేఖర్‌పై జరిగిన హత్యాయత్నాన్ని నిరసిస్తూ స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఇందులో బార్ అసోసియేషన్ ఇన్‌చార్జ్ అధ్యక్షుడు పీడీ రత్నం, సీనియర్ న్యాయవాదులు నగదాని చంద్రశేఖర్, రామ్‌గోపాల్, మనోహర్‌బాబు, కబీర్, చంద్రకాంత్ రెడ్డి, సుదర్శన్‌రావు, ధనుంజయ, విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

● గుంతకల్లు: పుత్తూరు కోర్టులో ఓ న్యాయవాదిపై జరిగిన దాడిని ఖండిస్తూ స్థానిక జెఎఫ్‌సీఎం కోర్టు న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఇందులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జరయాం, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ బీఎస్ కృష్ణారెడ్డి, న్యాయవాదులు వెంకటేశ్వర్లు, భాస్కర్ గౌడు, వెంకట నాయుడు, బడేసాబ్, గోపాలకృష్ణ, గురుప్రసాద్, మద్దికెర వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, తిమ్మప్ప, ఇదురువలి, శివరావు, నరసింహారావు, మస్తాన్, పార్వతి పాల్గొన్నారు.

చింతఫల సాయం వేలంపాట

శెట్టూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ సచివాలయం వద్ద శెట్టూరు గ్రామ పంచాయతీకి సంబంధించిన చింత ఫలసాయానికి మంగళవారం వేలంపాట నిర్వహించారు. చెట్లు మారుతి రూ. 59 వేలు అత్యధికంగా వేలంపాట పడారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి గోవిందప్ప, గ్రామ సర్పంచ్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

బ్రహ్మసముద్రం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పలకుంట, పిల్లలపల్లి, చెలిమేపల్లి, గుండిగానిదొడ్డి, వేపులపర్తి, గుడిపల్లి, గొల్లపల్లి పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌రెడ్డి, సుధాకర్, బ్రహ్మసముద్రం నాయకులు చంద్రశేఖర్ తిప్పేస్వామి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

రాయదుర్గం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో రూ.50 లక్షలతో రోడ్లకు శాశ్వత మరమ్మతుల పనులను విప్ కాలవ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు టంకశాల హనుమంతు, పొరాళు పురుషోత్తం, భోళె శంకర్ పాల్గొన్నారు.

● చెక్కు అందజేత

గుమ్మఘట్ట: మండలంలోని పైదొడ్డి గ్రామానికి చెందిన నాయకుల శివమ్మకు సీఎం సహాయనిధి కింద రూ.3,50,400 మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కును విప్ కాలవ ఆమె కుటుంబానికి అందజేశారు. ఇందులో టీడీపీ మండల కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కాలవ సన్నన్న, పైదొడ్డి రాజు, బేలోడు సంజీవ, సర్పంచ్ నాగరాజు, లోకేష్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

మార్కెట్ యార్డు మాజీ ఉపాధ్యక్షుడిపై దాడి


గాయపడిన ఓబిరెడ్డి

తాడిపత్రి, నవంబరు11(ఆంధ్రజ్యోతి): స్థానిక వైసీపీ నేత, మార్కెట్ యార్డు మాజీ ఉపాధ్యక్షుడు ఓబిరెడ్డి మంగళవారం ఉదయం పట్టణ సమీపంలోని యల్లనూరు రోడ్డు శివారులో వాకింగ్‌కు వెళ్లాడు. తిరిగి వస్తుండగా.. ఆరుగురు వ్యక్తులు బైక్‌లపై వచ్చి.. అతనిపై దాడి చేశారు. గాయపడ్డ అతన్ని ముళ్లపొదల్లో పడేసి వెళ్లిపోయారు. స్థానికులు అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అతన్ని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరామర్శించారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.

మొక్కజొన్న గడ్డి దగ్ధం

బెళుగుప్ప, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లిలో మంగళ వారం ట్రాక్టర్‌లో తరలిస్తున్న జొన్నగడ్డి కరెంటు తీగలను తగలడంతో దగ్ధమైంది. స్థానిక రైతు కృష్ణస్వామి గడ్డి కొనుగోలు చేసి ఊర్లోకి తరలిస్తుండగా గ్రామ కొత్త కాలనీలో విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. కాలనీవాసులు అప్రమత్తమై మంటలు ఆర్పారు. కరెంటు తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయని, వాటిని సరిచేయాలని గ్రీవెన్స్‌లో అధికారులకు వినతి పత్రం అందజేశామని, అయినా వారు స్పందించలేదని ఆ కాలనీ వాసులు వాపోయారు. ట్రాన్స్‌కో అధికారులు ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడాలని కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

యల్లనూరు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కాపురం క్రాస్ వద్ద బొలెరో, స్విఫ్ట్ డిజైర్ వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 2,800 క్వార్టర్ మద్యం బాటిళ్లను మంగళవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశామని, మద్యం, వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

క్లినిక్ సీజ్


సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

ఉరవకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత బస్టాండ్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న సిఫా ఆర్ ఎంపీ క్లీనిక్‌ను డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి మంగళవారం సీజ్ చేశారు. ఆ క్లీనిక్‌లో రూల్స్‌కు విరుద్ధంగా యాంటి బయోటిక్ సూదులు, సెలైన్ బాటిళ్లు పెడుతున్నారని రుజువు కావడంతో డీఎంహెచ్‌ఓ దాన్ని సీజ్ చేశారు. అలాగే మరో ప్రైవేట్ క్లీనిక్‌కు మెమోలు జారీ చేశారు. ఇందులో హెచ్‌ఈఈఓ త్యాగరాజు, డెమో నాగరాజు పాల్గొన్నారు.

ముగిసిన ఉరుసు


సవారీగా వస్తున్న స్వామివారి గుర్రం

బొమ్మనహాళ్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహొన్నూరులో నిర్వహిస్తున్న సయ్యద్ సర్మస్ వలి చిష్తి ఉరుసు ఉత్సవాలు మంగళవారంతో ముగిసాయి. మంగళవారం వన్నళ్లి గ్రామంలోని కే.పీ వంద్రప్ప ఇంటి నుంచి స్వామి వారి గుర్రం సవారీ సోమవారం అర్ధరాత్రి బయలుదేరి మంగళవారం వేకువజామున దర్గాహొన్నూరు దర్గాకు చేరింది. ముస్లింలు సంషేర్‌ను ఊరేగించారు.

తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు


పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న నాయకులు

విడపనకలు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు గ్రామంలో బీసీ కాలనీలో తాగునీటి సమస్య ఉంది. మంత్రి పయ్యావుల కేశవ్ ఆ కాలనీకి తాగునీటి పైప్‌లైన్ వేయించడానికి నిధులు మంజూరు చేయించారు. మంగళవారం చేపట్టిన ఆ పనులను మండల కన్వీనర్ బీడీ చిన్న మారయ్య, కాలువ అధ్యక్షుడు కాలువ మారయ్య, మాజీ ఎంపీటీసీ కుమరుస్వామి, టీడీపీ నాయకులు పరిశీలించారు.

నేటి నుంచి గ్రామసభలు

బొమ్మనహాళ్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రీసర్వే జరిగిన గ్రామాల్లో ఏవైనా తప్పులుంటే వాటిని సరిదిద్దేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మునివేలు మంగళవారం తెలిపారు. బుధవారం ఉంతకల్లు, కొలగానహళ్లి, గురువారం బండూరు, సింగనహళ్లి, శుక్రవారం ఉద్దేహాళ్, బొమ్మనహాళ్ గ్రామాల్లో ఈ గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

● బెళుగుప్ప :మండలంలోని కోణంపల్లి, గంగవరం గ్రామాల్లో బుధవారం రీసర్వేపై గ్రామసభలునిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అనిల్ కుమార్, రీ సర్వే గురుబ్రహ్మం తెలిపారు.

● కుందుర్పి: నిజవల్లి, ఎస్ మల్లాపురం గ్రామాల్లో రీసర్వేలో తప్పులు సవరించడానికి బుధవారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఓబులేష్ తెలిపారు.

● రాయదుర్గంరూరల్: మండలంలోని బీఎన్‌హళ్లి గ్రామంలో బుధవారం రీసర్వేపై గ్రామసభను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు.

15 నుంచి స్వమిత్వ గ్రామసభలు

యల్లనూరు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 15 నుంచి స్వమిత్వ 2.0పై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కరుణసాగర్ తెలిపారు. ఈనెల 15న కోడిమూర్తిలో, 20న మేడికుర్తిలో, 21న గడ్డంవారిపల్లిలో, 22న పాతపల్లిలో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్పొరేట్ సెలూన్ షాపును అడ్డుకోండి

గుంతకల్లుటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెట్రోల్ బంక్ వద్ద కొత్తగా మరో కార్పొరేట్ సెలూన్ షాపు ఏర్పాటు చేస్తున్నారని, దాన్ని అడ్డుకోవాలని సాంప్రదాయ మంగళి వృత్తిదారులు ఆలూరులో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఇందులో ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు బెలగంటి లక్ష్మీనారాయణ, నాయకులు బ్రహ్మ, శంకర్, వాసు, అజయ్, బాల, నవీన్, అంజి, మురళి, రంగా, సురేంద్ర పాల్గొన్నారు.